'ఉపాధి'కి వడదెబ్బ

- మండుటెండలోనే పనులు చేస్తున్న కూలీలు
- సేద తీరేందుకు నీడ కరువు
- ఇప్పటికే ముగ్గురు మృత్యువాత

కొత్తూరు మండలం మహాసింగికి చెందిన పి.వెంకటరమణ గత నెల 20వ తేదీన కర్లెమ్మ పంచాయతీలో చేపడుతున్న పనులకు వెళ్లాడు. పనులు ముగించుకుని సాయంత్రం 5.30 గంటలకు ఇంటికి చేరాడు. కొద్దిసేపటికే కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే ప్రాణాలు వదిలాడు.

అదే మండలం ఇరపాడుకు చెందిన కె.జానకమ్మ పెద్ద చెరువులో పనులకు వెళ్లి వడదెబ్బకు గురైంది. పనిచేస్తున్న చోటే స్పృహ కోల్పోయింది. తోటి కూలీలు ఆమెను ఇంటికి చేర్చిన కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయింది. గత నెల చివరిలో సరుబుజ్జిలికి చెందిన ఓ వ్యక్తి ఉపాధి పనులు ముగించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత ప్రాణాలు విడిచాడు. పని ప్రదేశంలో నీడ, తాగు నీటి సౌకర్యం లేక కూలీలు వడదెబ్బకు గురై ప్రాణాలు వదులుతున్నారు. ప్రస్తుతం ఎండలు ఠారెత్తిస్తుండడం, పని ప్రదేశాల్లో సేద తీరేందుకు నీడ లేకపోవడంతో పనులకు వెళ్లడానికే కూలీలు భయపడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 4.32 లక్షల మందికి జాబ్‌కార్డులు జారీ చేయగా, వాటిలో 3.78 లక్షల కార్డులు మనుగడలో ఉన్నాయి. మొత్తం 7.49 లక్షల మంది కూలీలకు గానూ ఏడాదిలో 6.08 లక్షల మంది చురుగ్గా పనులకు వస్తున్నారు. ప్రస్తుతం చేపడుతున్న ఉపాధి హామీ పనులకు 2.50 లక్షల మందికి పైగా హాజరవుతున్నారు. పని చేపడుతున్న ప్రాంతాల్లో ఎక్కడా టార్పాలిన్లు కనిపించడం లేదు. నీడ నిచ్చేందుకు టార్పాలిన్లు, వేసవిలో పని ప్రదేశాల్లో తగిన సదుపాయాలు లేకపోవడంతో కూలీలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

సంతబొమ్మాళి : మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారు. 40 డిగ్రీల సెల్సియస్ దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో చెమటలు కక్కుతున్నారు. ఎండలు మండుతుండడంతో ఉపాధి పనుల వేళల్లో మార్పులు చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి పది వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి 6.30 వరకు పని చేయిస్తున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని ప్రదేశంలో కల్పించాల్సిన సౌకర్యాలను కల్పించడం లేదు. ఒకటీ అరా చోట్ల మినహా నీడ కల్పించే టార్పాలిన్లు లేవు. నీడ కోసం కూలీలే సొంతంగా పందిళ్లు వేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. మరోవైపు తీవ్రమైన ఎండల్లో రెండు పూటలా పని చేయాల్సిందేనని కూలీలపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు.

కూలీల సౌకర్యాలకు కేంద్రం కోత

ఉపాధి కూలీలకు అదనంగా చెల్లించే వేసవి భృతిని రెండేళ్లుగా ఆపేశారు. 2020-21 వరకు ఉపాధి హామీ పనులకు రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా టిసిఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) టెక్నాలజీని వినియోగించేది. దేశవ్యాప్తంగా ఒకటే విధానం ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో 2021-22 నుంచి ఎన్ఐసి (నేషనల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో కూలీలకు అప్పటివరకు అందుతున్న సౌకర్యాలన్నీ ఆగిపోయాయి. వీటిలో వేసవి భత్యం ప్రధానమైంది. ఫిబ్రవరిలో అదనంగా 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మేలో 30 శాతం, జూన్‌లో 20 శాతం చొప్పున చెల్లించేవారు.

ఎండలతో భూమి గట్టి పడడం, వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతల్లో పనిచేయడం కష్టంగా ఉంటుందని వేసవి భత్యం కింద అదనంగా చెల్లించేవారు. వేసవిలో పనికి హాజరయ్యే కూలీలకు గతంలో మజ్జిగ కోసం రోజుకు రూ.5 చొప్పున అదనంగా చెల్లించేవారు. రెండేళ్లుగా దాన్నీ నిలిపేశారు. సాధారణ రోజుల్లో తాగునీటి కోసం రూ.5 చొప్పున చెల్లించే విధానం కూడా ప్రస్తుతం అమల్లో లేదు. పని ప్రదేశాల్లో కూలీలకు గతంలో నీడ కల్పించేందుకు టార్పాలిన్లు ఏర్పాటు చేసేవారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు కూలీలు టార్పాలిన్ల కిందకు వెళ్లి సేద తీరేవారు. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో మండుటెండల్లోనే చెమటలు కక్కుతూ పనిచేస్తున్నారు. ఈ క్రమంలోనే కొందరు అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

ఎంఇఒను సస్పెండ్ చేయండి

'నాడు-నేడు' పనుల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో చేపడుతున్న రెండో విడత నాడు - నేడు పనుల్లో నిర్లక్ష్యం వహించిన హిరమండలం ఎంఇఒను సస్పెండ్ చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్యను ఆదేశించారు. లక్ష్యాలను నిర్దేశిస్తూ గతంలో పలు సమావేశాలు నిర్వహించినా, పలు మండలాలు వెనుకంజలో ఉండడంపై మండిపడ్డారు. జూన్ 12వ తేదీ నాటికి పనులు పూర్తి కావాలని ఆదేశించారు. అప్పటికీ ప్రగతిని కనబరచని అధికారులపై వేటు తప్పదని అన్నారు. నాడు-నేడు రెండవ విడత పనులపై జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడత నాడు-నేడు పనుల్లో నిధులు మంజూరైనా పనులు చేపట్టని సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. కొన్ని మండలాల్లో మంజూరు చేసిన నిధుల కంటే అధికంగా ఖర్చు చేసి, శత శాతానికి పైగా పనులు పూర్తి చేయగలిగారని చెప్పారు.

అటువంటి పరిస్థితులే అన్ని మండలాల్లో ఉన్నా పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. మండలంలో చేపట్టాల్సిన పనులపై సంబంధిత అధికారులందరూ సమావేశమై ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రయత్నం చేసినా లక్ష్యాల సాధనలో ఆటంకాలు, అవరోధాలు వస్తే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నాడు-నేడు కింద పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన పది పనులతో పాటు అదనపు తరగతుల నిర్మాణాలు, అంగన్వాడీ కేంద్రాలపై సంబంధిత అధికారులు దృష్టిసారించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాల్లో సిడిపిఒలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పనులు ప్రారంభం కాకపోతే సంబంధిత అధికారులతో చర్చించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిర్మాణాలకు సిమెంట్, నిధుల కొరత లేదన్నారు. ఇప్పటికైనా ఇంజినీరింగ్ అధికారులు తీరు మార్చుకుని ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో సాధించాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త ఆర్.జయప్రకాష్, ఐసిడిఎస్, డిఆర్‌డిఎ పీడీలు జి.జయదేవి, డి.వి విద్యాసాగర్, ఎంఇఒలు, ఎపిఎంలు, సిడిపిఒలు, ఇఇలు తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

స్కానింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి స్పష్టం చేశారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టంపై జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు వెల్లడించడం నేరమన్నారు. లింగ నిర్ధారణ చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. బాల బాలికలు ఇద్దరూ సమానమేనని ప్రతిఒక్కరూ గ్రహించాలని చెప్పారు. బాలికలను ఎందులోనూ తక్కువగా చూడాల్సిన అవసరం లేదన్నారు. గర్భంలో ఉండగానే లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని తెలిపారు. బాలికలపై వివక్ష లేకుండా

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

సమాజంలో చైతన్యం తీసుకుని రావాలన్నారు. సమాజంలో మహిళా అవశ్యకతను విశ్రాంత జడ్జి పి.జగన్నాథం వివరించారు. ప్రజల్లో సామాజిక చైతన్యం రావాలని, అందుకు గ్రామస్థాయి నుంచి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఉప జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎన్.అనురాధ, సంఘ సేవకులు మంత్రి వెంకటస్వామి, సహాయ ప్రొఫెసర్ డా.అనుష, గిరిధర్, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భారీ ఈదురుగాలుల వర్షం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం, కవిటి

ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఉదయం నుంచీ అల్లాడుతున్న జనాలపై వరుణుడు కరుణించాడు. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. భారీగా వీచిన ఈదురుగాలులకు మామిడి నేలరాలగా, చిన్న దుకాణాల రేకులు ఎగిరిపోయాయి. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఇచ్ఛాపురంలో ఈదుపురం వద్ద భారీ వృక్షం నేలకూలింది. సయ్యద్ ఖాన్ చెరువు వద్ద తారకేశ్వర్ వీధిలో ఇంటి గోడ కూలి పాండవ మోహిని తలకు గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఇచ్ఛాపురం పట్టణంలో నెల రోజుల పాటు నిర్వహించిన స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రవేశద్వారం, గ్యాస్ కంపెనీ వద్ద, బెల్లుపడ జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన ద్వారాలు కుప్పకూలిపోయాయి. ఈ సమయంలో జన సంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లపై చెట్ల కొమ్మలు విరిగిపడడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. అరగంట పైబడి ఈదురుగాలులతో భారీ వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఇచ్ఛాపురం: కుప్పకూలిన ప్రవేశద్వారం

ఇచ్ఛాపురం : గాయపడిన మహిళ

కవిటి : నేలరాలిన మామిడికాయలు

నేరాలకు పాల్పడితే భవిష్యత్ నాశనం

- చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
- 'జాగృతి-యువత' కోసం ప్రారంభం
- ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

తెలిసీ తెలియని వయసులో నేరాలు చేసి కొంతమంది తమ భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకుంటున్నారని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. అరసవల్లిలోని ఒక ఫంక్షన్ హాల్‌లో జాగృతి-యువత కోసం పేరుతో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచి సన్మార్గంలో నడిపించడం ద్వారా బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో చదువుతున్న, చదువు ఆపేసిన, చదవుకోలేని 15 నుంచి 25 ఏళ్ల లోపు యువతీ యువకులకు పలు చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, పోలీసుల విధులు తదితర అంశాలపై ఐదు రోజుల పాటు అవగాహన కల్పించనున్నామని వివరించారు. గతంలో జిల్లాలో కళాశాల విద్యార్థులతో క్యాంపస్ కాప్స్ అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కల్పించడం ద్వారా సత్ఫలితాలు వచ్చాయని గుర్తుచేశారు. అమాయకత్వంతో యువత నేరాల బారిన పడుతున్నారని, ఎఫ్ఐఆర్‌లో పేరు నమోదు కావడంతో ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారని తెలిపారు. జాగృతి కార్యక్రమంలో నిపుణులు, సీనియర్ అధికారులు చెప్పిన ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని కోరారు. ఉత్సాహవంతులైన యువకులకు పోలీసు ఉద్యోగాలకు ఉపయోగపడే నైపుణ్యం, ఇతర అంశాలపై శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

జిల్లా ఉపాధి అధికారి జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం యువతకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ జాగృతి కార్యక్రమం ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా పలురకాల అంశాలపై శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి సింధు వర్చువల్ విధానంలో మాట్లాడుతూ యువతను సన్మార్గంలో నడిపించేందుకు జిల్లా పోలీసు శాఖ ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. సినీ దర్శకుడు సుహాష్, నటుడు కిరణ్ కుమార్ యువతపై ప్రభావం చూపుతున్న మొబైల్ ఫోన్లు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐదు రోజుల శిక్షణకు సంబంధించిన పలు అంశాలపై రూపొందించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు, డిఎస్‌పిలు శృతి, బాలరాజు, శ్రీనివాస్, ప్రొఫెసర్ నిక్కు అప్పన్న, సిఐలు పి.శ్రీనివాసరావు, ఎస్.వి రమణ, ఎస్ఐలు గణేష్, విజయ్ కుమార్, సందీప్ కుమార్, మహిళా పోలీసులు, యువతీ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ తదితరులు

15,281 మందికి మత్స్యకార భరోసా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో 15,281 మంది మత్స్యకారులకు చేపల వేట నిషేధ కాలంలో జీవనభృతి కల్పించడానికి వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద ప్రభుత్వం రూ.15.64 కోట్ల సాయం అందిస్తోందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. మత్స్యకార భరోసా కింద ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వర్చువల్ విధానంలో బటన్ నొక్కి మంగళవారం నిధులు విడుదల చేశారు. కలెక్టరేట్ నుంచి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ మంచినీళ్లపేట, మూలపేట తదితర ప్రాంతాల్లో ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వలసల నివారణలో భాగంగా వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం ఉన్న శ్రీకాకుళం జిల్లాలో మత్స్యకారులు సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా శాశ్వత పనులు చేపడతామన్నారు. సొంత భూముల్లో చేపల చెరువులకు అనుమతులు తీసుకొని మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం మత్స్యకార భరోసా నమూనా చెక్కును అందజేశారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఐషర్ వాహనం ద్వారా లైవ్ ఫిష్ రవాణా చేసుకునేందుకు సబ్సిడీపై మత్స్యకారులకు అందజేశారు. ఒక్కో యూనిట్ విలువ రూ.13,29,798 కాగా సబ్సిడీ రూ.5,31,920, లబ్ధిదారుని వాటా రూ.1,99,878, బ్యాంకు రుణం రూ.5.98 లక్షలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షులు కోనాడ నర్సింగరావు, జాతీయ మత్స్యకార సంఘం కార్యదర్శి సూరాడ రాజారావు, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాసరావు, వ్యవసాయ బోర్డు అధ్యక్షులు నేతాజీ, ఆప్కాస్ డైరెక్టర్ తోటమ్మ, డిసిసిబి సిఇఒ వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వృథా నీటి నిర్మూలన ద్వారా దోమలను నివారించవచ్చని, ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ సాధ్యపడుతుందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అభిప్రాయపడ్డారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవంలో భాగంగా జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ ర్యాలీని స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో జెండా ఊపి కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ రావడానికి గల కారణాలను తెలుసుకుని, వాటి నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన పెంచుకోవడం దీని ముఖ్య ఉద్దేశమన్నారు. డెంగీ, మలేరియా వంటి జ్వరాలు దోమల ద్వారా సంక్రమిస్తాయని తెలిపారు. దోమలు సంతానోత్పత్తి చేసేందుకు వీల్లేకుండా పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే గా నిర్వహించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. నిల్వ ఉన్న నీటిలో మాత్రమే డెంగీ దోమలు సంతానోత్పత్తి చేసేందుకు అవకాశం ఉన్నందున, ప్రతిఒక్కరూ ఇంట్లో, ఆరుబయట నీటి నిల్వలు లేకుండా డ్రైగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల డెంగీని అరికట్టేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

డెంగీ లక్షణాలు కనిపిస్తే తక్షణమే రక్తపరీక్ష, ఎలిసా పరీక్షలు వంటివి చేయించుకోవాలన్నారు. నిర్ధారణ అయితే తక్షణమే వైద్యులను సంప్రదించడం వల్ల ప్రాణాపాయ పరిస్థితి ఉండబోదని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు ర్యాలీ వరకు మాత్రమే పరిమితం కాకుండా మున్సిపల్, పారిశుధ్య, పంచాయతీ అధికారులు, సిబ్బంది డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఎడిఎంహెచ్ఒ ఎన్.అనురాధ, జిల్లా మలేరియా నివారణ అధికారి సత్యనారాయణ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జంపు కృష్ణమోహన్, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, సంఘ సేవకులు మంత్రి వెంకటస్వామి, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

- పారదర్శకంగా కొత్త లబ్ధిదారుల ఎంపిక
- పనిచేయని ఇంజినీర్లకు షోకాజ్ నోటీసులు
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో గృహ నిర్మాణాలపై ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. మంజూరైన ఇళ్లలో ఇప్పటివరకు నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల వివరాలు తీసుకుని, వారి స్థానంలో కొత్త లబ్ధిదారులకు అవకాశం కల్పించాలని సూచించారు. కొత్త లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని, స్థలాలు మంజూరైన తర్వాత నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో గృహ నిర్మాణాల ప్రగతిపై జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం సమీక్షించారు. గృహ నిర్మాణాల్లో జాప్యానికి గల కారణాలను గుర్తించి, వాటిని అధిగమించాలన్నారు. వచ్చే 45 రోజుల్లో నిర్మాణాలను పూర్తి చేయాలని చెప్పారు. తుది దశలో ఉన్న ఇళ్లపై ప్రత్యేక దృష్టిసారిస్తే నిర్మాణాలు మరింత వేగవంతం కాగలవని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత కాలంలో పనులు వేగవంతం కాకపోతే, వర్షాకాలంలో పనులు చేపట్టేందుకు అవకాశం ఉండబోదని చెప్పారు. పనులు పూర్తయిన కాలనీల్లో విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

పనుల్లో ప్రగతి కనబరచని కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, బూర్జ, టెక్కలి, కవిటి, నందిగాం మండలాల సహాయ ఇంజినీర్లకు, టెక్కలి ఉపకార్యనిర్వాహక ఇంజినీరుకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఇంకా ప్రగతిలో వెనుకంజలో ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మ్యాపింగ్, జియోట్యాగింగ్ పనులు శతశాతం పూర్తి కావాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎన్.గణపతిరావు, ఇపిడిసిఎల్, పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్లు, ఉప కార్యనిర్వహక, కార్యనిర్వాహక, సహాయ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

సమాజంలో ఆడ, మగ అనే లింగ బేధం ఉండరాదని రెవెన్యూ డివిజినల్ అధికారి బి.శాంతి అన్నారు. నగరంలోని ఆర్‌డిఒ కార్యాలయ ఛాంబరులో లింగ నిష్పత్తి, లింగ నిర్ధారణ చట్టంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల బాలికలు ఇద్దరూ సమానమేనని ప్రతిఒక్కరూ గ్రహించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసి బహిర్గతం చేస్తున్న స్కానింగ్ కేంద్రాలపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతిఒక్కరిలో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని, అందుకు తనవంతుగా రూ.పది వేలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి బి.అనురాధ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.వి రమణ, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, సంఘ సేవకులు మంత్రి వెంకటస్వామి, ఒకటో పట్టణ ఎస్ఐ గణేష్, డిప్యూటీ డెమోలు వెంకటేశ్వరరావు, కళావతి, మోహిని తదితరులు పాల్గొన్నారు.

21న కళింగపట్నం బీచ్ క్లీనింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన మిషన్ లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్) కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అందులో భాగంగా నగరంలోని డే అండ్ నైట్ కూడలి నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు చేపట్టిన సైకిల్ ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ర్యాలీలో తానూ సైకిల్ తొక్కుతూ పాల్గొన్నారు. తొలుత కాలుష్య నియంత్రణకు తోడ్పాటునిద్దాం అని అధికారులు, పర్యావరణ ప్రేమికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం కోసం జీవనశైలి ఉద్యమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా జూన్ ఐదో తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించి కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజలను చైతన్యవంతులను చేయనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 21న కళింగపట్నం బీచ్‌ను శుభ్రపరిచేందుకు నిర్ణయించామన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం చేయాలన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక

ఇంజినీర్ ఎస్.శంకర్ నాయక్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా చీఫ్ కోచ్ ఎం.మాధురిలత, సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు కైలాసరావు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని గోకర్ణపల్లి పంచాయతీ పరిధిలోని మున్సబ్‌పేట, రంగనాథ్‌పేట గ్రామాల్లో సర్పంచ్ చింతాడ మాధురి అధ్యక్షతన మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలు అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎంపిటిసి మాజీ సభ్యులు చింతాడ సత్యప్రసాద్, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, కిల్లి నాగేశ్వరరావు, చింతాడ జీవరత్నం భాస్కర్ పాల్గొన్నారు.

పాటల సిడిని ఆవిష్కరిస్తున్న శివాజీ

ఘనంగా గౌతు శిరీష జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- పలాస

పలాస తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గం ఇన్‌ఛార్జి గౌతు శిరీష జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు ఆధ్వర్యాన కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. శిరీషపై మాజీ మంత్రి శివాజీ రచన చేసిన పాట ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పళ్లు పంపిణీ చేశారు. కాశీబుగ్గ రామాలయం, పలాస ముత్యాలమ్మ కోనేరు ఆంజనేయ స్వామి గుడి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, టంకాల రవి శంకర్ గుప్త, డొక్కరి శంకర్, జోగ మల్లి, కూర్మారావు, సోమేశ్వరరావు, సత్యం, శ్రీనివాసరావు, అప్పారావు, మోహనరావు, చంద్రరావు, కృష్ణమూర్తి, ధనుంజయ, విజయ్, ప్రభు పాల్గొన్నారు.

దేవరవలసలో తాగునీటి వెతలు

మైలు దూరం వెళ్లి నీటిని తెస్తున్న మహిళలు

ప్రజాశక్తి- జి.సిగడాం

వేసవి తాగునీటికి కటకట అన్న పరిస్థితి తలెత్తుతోంది. కనీసం రోజు మార్చి రోజు వచ్చే నీరు కాస్తా నాలుగు రోజులకోసారి వస్తుండడంతో గ్రామస్తులు దాహానికి, నీటి అవసరాలు తీరని దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు దేవరవలస గ్రామస్తులు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని దేవరవలసలో కొద్ది రోజులుగా తాగునీటి సమస్య తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. రోజూ ప్రజలకు నీటిని సరఫరా చేయాల్సి ఉండగా, ప్రస్తుతం నాలుగు రోజులకొకసారి అధికారులు నీటిని అందించ లేకపోతున్నారని గ్రామస్తులు తెలిపారు. తాగునీటి కోసం గ్రామస్తులు పడరాని పాట్లు పడాల్సివస్తోంది. తీవ్రమైన వేసవిలో తాగునీరు రోజు తప్పించి రోజు కానీ, మహా అంటే రెండు రోజులకోసారి విడుదల కావడం సాధారణంగా భావించవచ్చును. కానీ, ప్రారంభంలోనే తాగునీటి సమస్య ప్రజలకు చుక్కలు చూపిస్తోంది.

కాలనీలో ఏకంగా నాలుగురోజుల ఒకసారి సుజలధార ద్వారా అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. అదీ కేవలం అర గంట నుంచి 45 నిమిషాలకు మించి విడుదల చేయడం లేదు. అందులోనూ ఎర్రని మండుట ఎండల్లో బిందెలు తీసుకుని నీటి బావుల వైపు పరుగులు పెడుతున్నారు. శక్తికి మించి రెండేసి బిందెలు ఒక్కరే మోసుకోవాల్సి వస్తోందని మహిళలు వాపోయారు. గ్రామానికి సుమారు మైలు దూరంలోని పంట పొలానికి వెళ్లి నేల బావిలో నీటిని తోడి తెచ్చుకుంటున్నామని అన్నారు. మార్గంమధ్యలో పొలం గట్లపై నడిచి వచ్చేందుకు అవస్థలు పడుతున్నామని వాపోయారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బగాది భాగ్యలక్ష్మిని వివరణ కోరా... గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుకు టెండర్లు వేశామని అన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే రైల్వే పనులు చేపట్టడంతో కొన్నిచోట్ల పైపులైన్ మరమ్మతులకు గురయ్యాయని అన్నారు. రెండు, మూడు రోజుల్లో మొత్తం పనిని పూర్తి చేసి సంబంధిత గ్రామానికి నీటిని అందిస్తామని తెలిపారు.

ముళ్లపొదల్లో నుంచి నీటిని తెస్తున్న మహిళలు

'నాడు-నేడు' పనులు వేగవంతం

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టెక్కలి ఉప విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ ఉపాధ్యాయులకు, అధికారులకు ఆదేశించారు. మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించి నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అదనపు తరగతి గదులను పాఠశాల ప్రారంభం నాటికి పూర్తి చేయాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలు వరకూ ఉదయం పూట ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. శతశాతం ఉత్తీర్ణులయ్యేటట్టు కృషి చేయాలన్నారు. జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులందరికీ చేరేలా చూడాలన్నారు. పాఠశాలలో శత శాతం అడ్మిషన్ చేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. నూతనంగా ప్రారంభం కాబోతున్న బాలికల జూనియర్ కళాశాల ప్రవేశాలకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందస : మండలంలోని హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను టెక్కలి ఉప విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఆ సమయంలో పాఠశాల ప్రచార రథం హైస్కూల్ ప్లస్ ఇంటర్మీడియట్, హైస్కూల్ ప్రవేశాలకు ఉపాధ్యాయులు వెళ్లడంపై పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల నాడు -నేడు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులందరికీ జెవికె కిట్లను అందజేయాలని సూచించారు. పాఠ్య ప్రణాళికలతో పాటు బోధన సామగ్రిని సిద్ధం చేసుకుని పిల్లలకు సులభమైన పద్ధతిలో బోధించాలని ఆదేశించారు. హైస్కూల్, హైస్కూల్ ప్లస్‌ల్లో అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఇంటర్ ఎంపిసిలో 40 మంది, బైపిసిలో 20 మంది విద్యార్థులు చేరేందుకు అంగీకారం తెలిపి ఉన్న పత్రాలను చూసి ప్రధానోపాధ్యాయులు ఎస్.తారకేశ్వరరావు, ఉపాధ్యాయులు చేసిన కృషిని ప్రశంసించారు. ఈమెతో పాటు ఉపాధ్యాయులు జి.తేజేశ్వరరావు, జి.లోహితాస్యుడు, కె.సాంబమూర్తి, జి.కోదండరావు ఉన్నారు.

పలాస : రికార్డులను పరిశీలిస్తున్న పగడాలమ్మ

అన్నంపేటలో గ్రామసభ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అన్నంపేటలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఎంపిడిఒ రవీంద్ర కుమార్ తెలిపారు. ఈ మేరకు అన్నంపేటలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనుల్లో జాబు కార్డు ఒకరి పేరు ఉంటే... పనులకు మరొకరు వస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని అన్నారు. దీంతో గ్రామంలో గ్రామసభ నిర్వహించి కూలీల నుంచి వివరాలు సేకరించామని అన్నారు. ఈ నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు. విచారణలో తహశీల్దార్ రమణారావు, ఎపిఒ సాయిరాం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ రవీంద్రకుమార్

అధిక ఫీజుల వసూళ్లపై ఫిర్యాదు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని ప్రయివేటు పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు, వివిధ ఫండ్ల రూపంలో విద్యార్థుల నుంచి భారీ మొత్తాలను వసూలు చేస్తున్నారని, వీటికి అడ్డుకట్ట వేయాలని టిఎన్ ఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు డిఇఒ కార్యాలయ సూపరింటెండెంట్‌ను మంగళవారం కలిసి ఫిర్యాదు చేస్తూ... వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదు అందజేసిన వారిలో టిఎన్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు బలగ ప్రహర్ష, జనరల్ సెక్రెటరీ గుర్రాల సుమంత్, నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డి గిరిజ శంకర్, టిఎన్ఎస్ఎఫ్ కమిటీ సభ్యులు అనిల్, రాంబాబు ఉన్నారు.

క్రైమ్ కార్నర్

చెరువులో మృతదేహం లభ్యం

కోటబొమ్మాళి: మండలంలోని చవితిపేట చెరువులో గుర్తు తెలియని మృతదేహాన్ని మంగళవారం గ్రామస్తులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈయన వయసు 35 నుంచి 40 వరకు ఉంటుందని ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. చామని ఛాయ రంగు కలిగి నలుపు నిక్కర్ ధరించి ఉన్నాడని అన్నారు. మృతికి గల కారణాలు తెలియరావాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని గుర్తించి బంధువులు, కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు సంప్రదించాలని కోరారు.

గుర్తుతెలియని మృతదేహం

దెబ్బతిన్న ఆర్‌టిసి బస్సు

తృటిలో తప్పిన ప్రమాదం

పొందూరు : మండలంలోని కృష్ణాపురం సమీపంలో అతివేగంగా వెళుతున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సు, కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో ప్రమాద తప్పింది. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో పొందూరు నుంచి చిలకపాలెం వైపు వెళుతున్న ఇసుక ట్రాక్టరు బస్సును, కారును ఢీకొంది. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు పట్టివేత

పొందూరు: మండలంలోని కోటిపల్లికి చెందిన పోలాకి త్రినాథరావు అక్రమంగా మద్యం చేసిన తరలిస్తుండగా మంగళవారం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు తెలిపారు. పట్టుబడి వ్యక్తి వద్ద గల 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎస్ఐ కె.మురలి, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తేజేశ్వరరావు

విశాఖ సదస్సుకు హాజరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విశాఖ నగరంలోని డాబా గార్డెన్‌లో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన 'ఈ పారిశ్రామిక మరణాలకు బాధ్యులు ఎవరు? అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు హాజరయ్యారు. ఈ సదస్సులో పారిశ్రామిక విధానంలో కార్మికులకు జరుగున్న అన్యాయం, చట్టాల సవరణ తదితర అంశాలపై ఆయన మాట్లాడారు.

వడదెబ్బకు వృద్ధుడు మృతి!

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కొర్లకోటకు చెందిన పేడాడ సింహాచలం (66) వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... సింహాచలం గ్రామ సమీపంలో ఉన్న ఎల్లమ్మ చెరువులో చేపలు తీస్తున్నారు. విషయం తెలుసున్న ఆయన అక్కడకు వెళ్లి చేపలను కొనుగోలు చేసి ఇంటికి చేరుకున్నాడు. తరువాత పొలానికి వెళ్లి తిరిగి 12 గంటల సమయంలో మరలా ఇంటికి చేరుకున్నారు. కొద్ది సమయానికి నీరసంగా ఉందని, కళ్లు తిరుగుతున్నాయని, ఒంట్లో తిప్పుతున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే వారు హుటాహుటిన 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108 వచ్చేలోపు వాంతు కావడంతో స్పృహ తప్పి పడిపోయాడు. 108లో సిబ్బంది ప్రాథమిక చికిత్స చేశారు. ఆయన నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మధ్యాహ్నం కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు నిర్వహించారు. మృతునికి భార్య చిలకమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

సింహాచలం (ఫైల్)

'ఎన్ఐఆర్'ను పరామర్శిస్తున్న వీర్రాజు

'ఎన్ఐఆర్'కు పరామర్శ

రణస్థలం రూరల్: ఎచ్చెర్ల నియోజకవర్గ బిజెపి కన్వీనర్, ఎన్ఐఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు తండ్రి అప్పలకొండ దొర సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు మంగళవారం బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెంలో ఎన్ఐఆర్ స్వగృహం వద్ద వెళ్లి ఈశ్వరరావును మంగళవారం పరామర్శించారు. ముందుగా అప్పలకొండ దొర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆయనతో పాటు ప్రభుత్వ మాజీ విప్ గద్దె బాబూరావు, విజయనగరం పార్లమెంటరీ అధ్యక్షులు రెడ్డి పావని, రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం, ఇజ్జాడ శ్రీనివాసరావు, నెలిమర్ల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ బూర్లె శ్రీధర్, ప్రధాన కార్యదర్శి హరనాథ్ పాల్గొన్నారు.

అలాగే ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, వ్యాపారవేత్త మేకా శ్రీనివాస్, జె.ఆర్.పురం ఎస్ఐ జి.రాజేష్, లావేరు మండలం వైస్ ఎంపిపి లుకలాపు శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, పిన్నింటి భానోజీ నాయుడు, రౌతు శ్రీనివాసరావు, ఆకుల రవి కుమార్, బాలి శ్రీను, పిసిని జగన్నాథంనాయుడు, పిన్నింటి శ్రీచరణ్, లంక శ్యాం, డిజిఎం ఆనందరావు, ముప్పిడి సురేష్, తోటయ్యదొర, మధుబాబు పరామర్శించారు.

జాబ్ కేలండర్ ప్రకటించాలి

ఎమ్మెల్సీ చిరంజీవిరావు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రభుత్వం ఏటా నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నాలుగేళ్లు అవుతున్నా ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వాకాడ చిరంజీవిరావు అన్నారు. ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లఖినేని కరుణాకర్ ఇంట్లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు మేము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు పాత పింఛను విధానం తీసుకొచ్చిందన్నారు. ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైన ప్రభుత్వ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి వాటిని జాబ్ కాల్యేండర్ ద్వారా ఉద్యోగాలు కల్పించాలని, లేకుంటే దీని కోసం పోరాడుతానని అన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ



శిక్షకులతో నాగేశ్వరరావు

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మొదటి ఏడాది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి), సిఎస్ఇ, సిఎస్ఎం, సిఎసిల 650 మంది విద్యార్థులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన విద్యార్థులకు శిక్షణ ఇచ్చామని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఐతమ్ సిఎంఎస్ ఎక్సెన్స్ సెంటర్‌లో ఈనెల 11 నుంచి 20 వరకు 'ప్రొడెక్టివిటీ ఎనేన్స్మెంట్ టూల్స్' అనే అంశంపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. గూగుల్ డ్రైవ్, గూగుల్ మెయిల్, గూగుల్ డాక్స్, గూగుల్ క్యాలెండర్, గూగుల్ సీట్స్, గూగుల్ స్లైడ్స్, గూగుల్ సైట్స్, గూగుల్ ఫార్మ్, కోడేమేనేజ్మెంట్, డిజిటల్ ప్రొఫైల్ క్రియేషన్ వంటి అంశాల్లో టి.శ్రీకన్య, వి.అనిల్ కుమార్, ఎంపీ సంతోష్ కుమార్‌లు శిక్షణ ఇచ్చారని అన్నారు. ఐటి అసిస్టెంట్ హెచ్ఐడి డాక్టర్ బి.రమేష్‌నాయుడు, సిఎస్ఇ అసిస్టెంట్ హెచ్‌డి డాక్టర్ టి.రవికుమార్, సిఎస్ఎం హెచ్‌డి ఎం.వి.పి.చంద్రశేఖర్, ఎపిఎస్ఎస్ఎసి స్పాక్ డాక్టర్ వి.అశోక్ కుమార్, విభాగ కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.పాండురంగ విఠల్, పవన్‌కుమార్, ఎస్.వి.ఎస్.శాంతి ఈ శిక్షణా తరగతులను పర్యవేక్షించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.ఆర్ తెలిపారు.

19 నుంచి క్రికెట్ టోర్నీ

నరసన్నపేట : స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 19 నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఆర్ఎస్‌సిఎ సభ్యులు డేవిడ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కాకర్ల రవి మెమోరియల్ ఆధ్వర్యాన ఈ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలలకు చెందిన క్రికెట్ క్రీడాకారులకు టోర్నమెంట్‌లో పాల్గొవాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొదలచిన వారు రూ.వెయ్యి ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి మ్యాచ్‌కూ మ్యాచ్ ఆఫ్ ద మ్యాచ్ ఉంటుందన్నారు. ప్రథమ బహుమతి రూ.పది వేలు ట్రోఫీ, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, ట్రోఫీని అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు శివ 6303184421, అనీల్ 7396963469 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రాము, లక్ష్మీనారాయణ, అశోక్, విజయ్, అనిల్, రాజేష్, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డేవిడ్

వంతెనల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గం పిఎంజిఎస్‌వై పథకం కింద అనుమతులు పొందిన వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీడ్ ఎపి చైర్మన్ సాఢి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడలోని పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్లు బాలునాయక్, అమరనాథ్‌రెడ్డిలను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో పిఎంజిఎస్‌వై పథకం ద్వారా అనుమతులు పొందిన ఐదు వంతెనలు నిర్మాణానికి సంబంధించి చర్యలు తీసుకోవాలన్నారు. బూర్జపాడు, డొంకూరు, రట్టి మహేంద్ర తనయా, బారువ, రట్టి రోడ్లలో వంతెలన నిర్మాణానిలకు అడ్మినిస్ట్రేటివ్, ఫైనాన్షియల్ అప్రూవల్‌కు సంబంధిత ఫైల్‌ను వేగవంతం చేయాలని కోరారు. ఇచ్ఛాపురం మండలం అరకభద్రకు హైఇంపాక్ట్ వర్కులో భాగంగా రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించాలని కోరారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించి త్వరలో కార్యాచరణ ప్రారంభిస్తామని వారు తెలిపారని అన్నారు.

ఒరియా విద్యార్థుల సమస్యల పరిష్కరించాలి

కవిటి మండలంలో ఒరియా మీడియం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని సీడ్ ఎపీ చైర్మన్ సాఢి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడలోని కమిషనర్ అఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎస్.సురేష్ కుమార్‌ని కలిసి వినతిపరతం అందజేశారు. ప్రస్తుతం ఆరు నుంచి పదో తరగతి చెందిన 76 మంది విద్యార్థులకు ఒకే తరగతి గదిలో పాఠాలు వింటున్నారని అన్నారు. ఆఫీస్ రూమ్, కిచెన్ రూమ్, మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. విషయంపై సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

కవిటి : ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

జలుమూరు : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కవిటి: పరిసరాల పరిశుభ్రతతోనే అనేక వ్యాధులను నివారించవచ్చని బెలగాం ప్రభుత్వాస్పత్రి వైద్యులు పి.రాకేష్, డి.కవిత అన్నారు. ప్రపంచ డెంగ్యీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బెలగాంలో మంగళవారం డెంగీపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యం, అపరిశుభ్రతే అనారోగ్యం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతే మలేరియాకు అసలైన నివారణ అని, ఇంట్లో వ్యర్థాలను బయట వేయకుండా డంపింగ్ యార్డుకు తరలిస్తే దోమలు పెరగకుండా నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ ఎం.కృష్ణారావు, హెచ్ఇ బి.మంగమ్మ, పిహెచ్ఎన్ టి.మంగమ్మ, ఎల్.టి.బి.శివప్రసాద్, హెచ్‌విడబ్ల్యు టి.భారతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జలుమూరు: ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నియంత్రణ సాధ్యమవుతుందని దంత వైద్యాధికారి లీలా కుమార్ అన్నారు. జలుమూరు పిహెచ్‌సి కార్యాలయం వద్ద జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం డ్రై డేగా పాటించి నీటిని నిల్వ ఉంచే డ్రమ్ములను శుభ్రం చేయాలన్నారు. నీటి ట్యాంకులపై మూతలు మూసి ఉంచాలన్నారు. కొబ్బరి చిప్పల్లో నీటిని నిల్వ ఉంచరాదన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ ఎస్.పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ చిన్న రాజులు, పిహెచ్ఎన్ రాజ్యలక్ష్మి, సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరం

కవిటి: కవిటి అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన చింతామణి అమ్మవారి సంబరం అంబరాన్నంటింది. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి కళామండలి ఆధ్వర్యాన నిర్వహించిన కోయిడాన్స్, 30 మంది మహిళలతో విశాఖపట్నం బృందం ప్రదర్శించిన కోలాటం, విశాఖపట్నానికి చెందిన 20 మంది ప్రదర్శించిన తీన్మార్, రేగులపాడు వారు ప్రదర్శించిన తప్పెటగుళ్లు ఆహుతులను అలరించాయి. డప్పు వాయిద్యాలు, సాము గరిడీలు, విచిత్ర వేషధారణలు, భారీ లైటింగ్, సౌండింగ్, మందుగుండ సామగ్రిలతో సంబరం అంబరాన్ని తాకింది. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే బెందాళం అశోక్, కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మండలంలోని నాయకులు, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

డ్రమ్స్ వాయిస్తున్న మహిళలు

యువత సన్మార్గంలో నడవాలి

ఆమదాలవలస : మాట్లాడుతున్న కమిషనర్ రవిసుధాకర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

యువత చెడు మార్గంలో నడవకుండా సన్మార్గంలో నడవాలని సైకాలజీ అధ్యాపకులు నాగరాజు అన్నారు. పట్టణ శివారున ఫ్లైఓవర్ దగ్గరలో ఉన్న ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో పోలీసు శాఖ ఆధ్వర్యాన జాగృతి యువత అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉన్న యువత ఆవేశంలో తప్పుదారి పట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. చెడు మార్గం వైపు నడవకుండా ఇదే సమయంలో కెరీర్‌పై దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు. ప్రజల్లో చైతన్యం రావాలంటే యువతతోనే సాధ్యమన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిస కాకుండా విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నారు. చట్టాలపై అవగాహన కలిగి నేరాల వైపు దృష్టి మళ్లించకుండా సన్మార్గం వైపు నడిచి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. విద్యార్థి దశలో ఐదేళ్ల పాటు ఇష్టపడి విద్యను అభ్యసిస్తే 40 ఏళ్లు సుఖంగా, ఆనందమయ జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.పైడయ్య, పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎస్ఐ వై.కృష్ణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: యువత అభివృద్ధి దిశగా ఎదిగాలని, పెడదారి పడకుండా సక్రమమైన మార్గం అనుసరించాలని డిఎస్‌పి జి.బాలచంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో జాగృతి కార్యక్రమంలో భాగంగా యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమలో సిఐ చంద్రమౌళి, ఎస్ఐ ఎల్.రామకృష్ణ, మేథావుల ఫోరం చైర్మన్ జి.వి.రెడ్డి పాల్గొన్నారు.

సోంపేట : జీవితంలో ఎంత కీలకమైన యువత దశలో చెడు మార్గాల వైపు ఆకర్షితులు కాకూడదని, ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధన కోసం కృషి చేయాలని సిఐ రవిప్రసాద్ సూచించారు. సోంపేట సర్కిల్ పరిధిలోని సోంపేట, బారువ, కంచిలి తదితర పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యాన ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్ యువతకు అవగాహన కల్పించారు. అలాగే బారువ హరిత రిసార్ట్స్‌లో ఎస్ఐ సత్యనారాయణ, కంచిలి మార్కెట్ యార్డు కమిటీ వద్ద ఎస్ఐ చిరంజీవి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : యువత చెడు వ్యసనాల బారిన పడకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలని పాతపట్నం సిఐ వినోద్‌బాబు అన్నారు. స్థానిక కమలా కళ్యాణ మండపంలో జాగృతి యువత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. యువకులకు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మాధవరావు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జాగృతి-యువత కోసం కార్యక్రమంలో స్థానిక ఆర్‌జె ఫంక్షన్ హాల్‌లో సిఐ ఈశ్వర్ చంద్ర ప్రసాద్ యువతకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ.గోవిందరావు, రూరల్ ఎస్ఐ వి.రమేష్, జ్ఞాన భారతి విద్యా సంస్థలు కార్యదర్శి జోహార్ ఖాన్, విశ్రాంత ఉపాధ్యాయులు జయపతి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: జాగృతి యువత కారక్రమంలో స్థానిక రెడ్డి కళ్యాణ మండపంలో యువతకు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లఖినేని కరుణాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ : కొల్లివలస కురుకుల పాఠశాలలో జాగృతిలో భాగంగా విద్యార్థులకు ఎస్ఐ మహమ్మద్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట : అవగాహన కల్పిస్తున్న సిఐ రవిప్రసాద్

మెళియాపుట్టి : మాట్లాడుతున్న సిఐ వినోద్‌బాబు

టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న డిఎస్‌పి బాలచంద్రారెడ్డి

ఈ ఏడాదైనా సాగునీరు అందిస్తారా?

వంశధార అధికారులను ప్రశ్నిస్తున్న సాయికృష్ణ

వంశధార అధికారులను ప్రశ్నించిన సాయికృష్ణ

ప్రజాశక్తి- పలాస

ఏటా శివారు భూములకు సాగునీరు అందించడంలో వంశధార అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఈ ఏడాది ఖరీఫ్ నాటికి శివారు భూములకు సాగునీరు అందించకపోతే ఉద్యమిస్తామని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయికృష్ణ వంశధార అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉంగ ప్రవీణ అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట భూములకు వంశధార నీరు సరఫరా చేయకపోయినా రైతుల నుంచి నీటి తీరువా ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. పంట భూములకు వంశధార నీరు సరఫరా చేయకుండా అధికారులు ప్రజా ప్రతినిధులు, రైతులకు తప్పు తోవ పట్టిస్తున్నారని అన్నారు. షట్టర్లు కుంభకోణానికి, సాగునీరు సరఫరాకు ఏమి సంబంధమని ప్రశ్నించారు. వంశధార కాలువలు పూర్తిగా పాడైన ఎందుకు మరమ్మతులు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంశధార అధికారులకు కాలువ ఎల్లలూ తెలియని అన్నారు.

ఈ ఏడాది ఖరీఫ్ సమయంలో సాగునీరు అందించకపోతే అవసరమైతే మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు కలిసి కాలువలు వద్ద, వంశధార కార్యాలయం వద్ద నిరసన చేపడతామని హెచ్చరించారు. ఎంపిపి మాట్లాడుతూ మండలంలో భూసార పరీక్షలు చేపట్టారా లేదా? భూసార పరీక్షలు ఎక్కడెక్కడ చేపట్టారని వ్యవసాయశాఖ అధికారులకు ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ ఎఇఒ పాపారావు మాట్లాడుతూ మండలంలోని అల్లుకోల పంచాయతీలో 20 మంది రైతుల భూముల నుంచి మట్టి నమూనా సేకరించామని చెప్పారు. టెక్కలిపట్నం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుందని, సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలని ఆమె కోరారు. వైస్ ఎంపిపి తలగాన శ్రీరాములు మాట్లాడుతూ మండలంలోని పిల్ల కాలువలో కూడికలు విపరీతంగా పేరుకుపోతున్నాయని, అంత భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందరం లేదని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పిల్ల కాలువలను ఎన్ఆర్ఇజిఎస్‌లో పెట్టి ఉపాధి కూలీలతో పూడికలు తొలగించాలని కోరారు.

బొడ్డపాడు సర్పంచ్ తామడ మదన్ మాట్లాడుతూ బొడ్డుపాడు చెరువును అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై ఎంపిడిఒ రమేష్‌నాయుడు స్పందిస్తూ ఇరిగేషన్ చెరువుల్లో ఉపాధి పనులు చేసే సమయంలో తప్పనిసరిగా ఇరిగేషన్ అధికారుల సూచనల మేరకు పనులు చేపట్టాలని, ఇష్టానుసారంగా పనులు చేపడితే పంట భూములకు సాగునీరు అందడం కష్టమవుతుందని అన్నారు. చినంచల ఎంపిటిసి బమ్మిడి దుర్యోధన మాట్లాడుతూ గ్రామంలో హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులు ఎప్పటిలో పూర్తి చేస్తారని అధికారులను ప్రశ్నించారు. సమావేశంలో తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న సూర్యారావు

భూ సర్వేతో శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి- బూర్జ

సమగ్ర భూ సర్వేతో శాశ్వత పరిష్కారం రైతులకు లభించిందని వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు అన్నారు. మండలంలోని కంట్లంలో సమగ్ర భూ సర్వేను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి ప్రభుత్వ, రైతుల భూముల నిర్ధారణ జరగని భూములకు ఈ సమగ్ర భూ సర్వేతో శాశ్వత హక్కులను అందించేందుకు సాధ్యపడుతుందన్నారు. సర్వే అనంతరం రైతులకు చుక్కల భూముల సమస్యలు తొలగి కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి విముక్తి కలుగుతుందన్నారు. ఈ బృహత్తర భూ సర్వే కార్యక్రమం ద్వారా అనతికాలంగా ఉన్న భూముల రికార్డులు సరిచేయడం అవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు ఉదయకుమార్, జగన్ పాల్గొన్నారు.

పెన్షనర్లు ఇకెవైసి చేయించుకోవాలి

ఆమదాలవలస : సబ్‌ట్రెజరీ పరిధిలోని ఇకెవైసి చేయించుకొని పెన్షనర్లు వెంటనే చేయించుకోవాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. 591 మంది పెన్షనర్లు ఇకెవైసి చేయించుకోలేదని అన్నారు. అటువంటి వారికి రానున్న రోజుల్లో ఇబ్బందులు తప్పవని తెలియజేశారు. పెన్షనర్ల జాబితాను సబ్ ట్రెజరీ అధికారి ఎస్.సువర్ణరాజు తమకు అందజేశారని తెలిపారు. ఆపెన్షనర్లు సబ్ ట్రెజరీ కార్యాలయంలో గాని, నెట్ సెంటర్లు, హెర్బ్ ఆప్షన్ ద్వారా గాని వెంటనే నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రారంభిస్తున్న గోపి

సొంత నిధులతో బోరు మరమ్మతులు

పలాస : కాశీబుగ్గ పరిధి సూదికొండ కాలనీలో పవర్ బోరు పాడవడంతో తాగునీటికి ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయం తెలుసు కున్న వార్డు కౌన్సిలర్ ప్రతినిధి శిష్ట గోపి తన సొంత నిధులు రూ.3 వేలు వెచ్చించి బోరుకు మరమ్మతులు చేపట్టారు. అనంతరం ట్యాప్‌ల ద్వారా నీటిని సరఫరా చేశారు. దీంతో వార్డు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

ఆమదాలవలస : మండలంలోని శ్రీనివాసాచార్యులపేట పంచాయతీ ఈసర్లపేటలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా కళాకారుల ద్వారా మంగళవారం అవగాహన కల్పించారు. ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకుఆఫ్ ఇండియా సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు పొదుపు ప్రాముఖ్యతను అందరూ తెలుసుకొని పొదుపు చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు అకౌంట్లను కలిగి ఉండాలని, వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. సామాజిక భద్రతా పథకాలను తెలుసుకొని వాటిని పొందాలన్నారు. డిజిటల్ పేమెంట్స్ వ్యవస్థ గురించి వివరిస్తూ నగదు రహిత లావాదేవీలను కొనసాగించాలని అవగాహన కల్పించారు. రూపే, ఎటిఎం కార్డుల వల్ల ప్రజలకు కలిగే లాభాలను వివరించారు. బ్యాంకుల ద్వారా అమలవుతున్న బీమా పథకాల గురించి వివరించారు. అలాగే సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ 144148 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను), ఫీల్డ్ అసిస్టెంట్ కె.మహేష్, సిఎఫ్ఎల్ సిబ్బంది రామారావు, కళాజాతా బృందం కళాకారులు కె.శంకరరావు, కె.కృష్ణారావు, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బూర్జ : మండలంలో కొల్లివలస కూడలిలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు కొత్తకోట నాగేంద్ర, ఎంపిటిసి విక్రమ్ మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజూ మజ్జిక, చల్లని నీరు పాదచారులకు, వాహనదారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గేదెల వాసు, కిరణ్, పొట్నూరు ప్రసాద్, సేపేన రమేష్, టంకాల రమేష్, రుద్ర రౌతు జగ్గునాయుడు, మహేష్ పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న నాగేంద్ర

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

గౌతు కుటుంబం చేసింది శూన్యం

ప్రజాశక్తి- పలాస

పలాస, సోంపేట నియోజకవర్గంలో 60 ఏళ్లగా పదవులు అనుభవించి ఆయా నియోజకవర్గాల్లో అభివృద్ధి చేసింది శూన్యమని వైసిపి పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం విమర్శించారు. స్థానిక ప్రగతి భవన్ వైసిపి కార్యాలయంలో మంగళవారం వైసిపి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రజలపై ఆధారపడి బతికేయాలన్నా ఆరాటం, ఆతృత గౌతు కుటుంబానికి ఇంకా తగ్గలేదని విమర్శించారు. అత్యంత ధనిక సంపన్న స్వాతంత్ర సమరయోధులుగా చరిత్రకెక్కిన గౌతు లచ్చన్న, ప్రజల అవసరాల కన్నా సొంత ప్రయోజనాలు ఆర్థిక అభివృద్దే ధ్యేయంగా రాజకీయాలు చేసిన ఘనత గౌతు కుటుంబానికి దక్కుతుందని ఎద్దేవా చేశారు. పశుసంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజుపై ఆరోపణలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బాలచంద్రుడు, దుర్గాశంకర్ పండా, గుజ్జు జోగారావు, సిస్టు గోపి, కౌన్సిలర్లు బెళ్లాల శ్రీను, సవర సోమేశ్వరరావు, బమ్మిడి సంతోష్ పాల్గొన్నారు.

వేధింపులు సరికాదు

కొత్తూరు: వైసిపి కార్యకర్తలను ఎమ్మెల్యే రెడ్డి శాంతి కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి రేగేటి కన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక బయ్యల కళ్యాణ మండపంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించిన వారినే వేధిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే గెలుపునకు సహకరిస్తే టిడిపి నాయకులకు పదవులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈసారి టిక్కెట్ ఇస్తే సహకరించమని స్పష్టం చేశారు. 2019లో ఎమ్మెల్యేగా గెలిపించి తప్పు చేశామని పేర్కొన్నారు. ఈయన తో పాటు వైసిపి నాయకులు లోతుగెడ్డ తాతబాబు, కొయి లాపు సంజీవరావు, ప్రశాంత్‌కుమార్, సర్పంచ్ లు కె.శ్రీనివా సరావు, పి.అప్పారావు, అగతముడి రంజిత్ కుమార్, వై.పోలి నాయుడు, ఎంపిటిసి చీకటి వీర్రాజు, బి.నారాయణరావు, టి.రమణారావు పి.వెంకటకృష్ణ, ఎల్.ఇందిర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కన్నయ్య

మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలు చదవాలి

ఎచ్చెర్ల : మాట్లాడుతున్న చంద్రశేఖరరావు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మహనీయుల జీవిత చరిత్రల పుస్తకాలు విద్యార్థులు చదవాలని ధర్మపురానికి చెందిన విద్యాధికుడు ముద్దాడ సురేష్ అన్నారు. మండలంలోని ధర్మవరం శాఖాగ్రంథాల యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు మహనీయుల జీవిత చిత్రలను వివరిస్తూ... చదివించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఏదో ఒక సమయంలో మహనీయుల జీవిత చరిత్రల పుస్తకాలను చదవాలని తెలియజేశారు. రుచికరమైన మాటలు వింటే మనసు ఆనందంతో నిండిపోతుందన్నారు. అనిర్వచనీయమైన అనుభూతి కలుగుతుందని తెలిపారు. గ్రంథాలయ అధికారి మల్లిపెద్ది చంద్రశేఖరరావు మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రలు, మంచి మాటలు, మహనీయుల పుస్తకాలు, ఖాళీ సమయంలో విద్యార్థులు చదవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు బి.సూర్యనారాయణ, గ్రంథాలయ పాఠకులు మహేష్, జగదీష్, కిరణ్, శంకర్, ప్రకాష్, సూరిబాబు పాల్గొన్నారు.

బలగ : బలగ శాఖాగ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను నీతి కథలు, పద్యాలు చెప్పారు. అనంతరం పిల్లలందరికీ మ్యూజికల్ చైర్ ఆటలాడించారు. కార్యక్రమంలో సహాయకులు కె.అనిత, 32 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు : భారతదేశ భౌగోళిక పరిస్థితుల గురించి విద్యార్థులు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని రిసోర్స్‌పర్సన్ వి.మణిబాబు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లావేరు మురపాక శాఖాగ్రంథాలయంలో భారతదేశ భౌగోళిక పరిస్థితుల గురించి వివరించారు. అలాగే ప్రపంచ పటం, ప్రపంచ ఖండాలు, ప్రపంచ సముద్రాలు, పర్వత శిఖరాలు, ప్రపంచ దేశాలు, జలపాతాలు, ప్రధాన నదులు గురించి వివరించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంచుకునేందుకు ఉపయోగ పడతాయని జిల్లా గ్రంథాలయ అధికారి ఎస్.వి.రమణమూర్తి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. ఇటువంటి శిబిరాల వల్ల కొత్త క్యాంపుల్లో విద్యార్థులు కొత్త వారితో ఎలా మెలగాలన్న అంశంపై అవగాహన ఉంటుందన్నారు. తెలుగు ఉపాధ్యాయులు ఎస్.ఈశ్వరరావు విద్యార్థులకు తెలుగు కథలు, న్యూస్ పేపర్ చదవడం, మ్యూజికల్ చైర్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. శిబిరంలో పి.ఈశ్వరరావు, పి.భానుమతి, గణేష్ పాల్గొన్నారు.